# స్వయంవరం

సుందర్రామయ్యగారికి ఒక్కతే కూతురు, పేరు లలిత. పేరుకుతగ్గట్టే చాలా అందంగా, లలితంగా వుంటుంది. ఆమెకి పెళ్ళీడు వచ్చిన దగ్గరనించి ఆయనకి దిగులు, బెంగ ఎక్కువైనాయి. ఆయన దిగులు కూతురు పెళ్ళి చెయ్యలేకకాదు, రాబోయే అల్లుడిని గూర్చి. ఇంత అవస్థపడి ఎంతో డబ్బు ఖర్చుపెట్టి కూతురు సుఖపడుతుందని పెళ్ళిచేస్తే, తీరా వచ్చిన అల్లుడు మొండి, తలతిక్కవాడు అయితే? కూతురు భవిష్యత్తేమిటి? దాన్ని చూస్తూ తను బతగ్గలడా? అందులో ఆయన స్నేహితులు ఈ మధ్య ఒకళ్ళిద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసి అల్లుళ్ళతో ఏంతెంత అవస్థ పడుతున్నారో కళ్ళారా చూసి, మళ్ళీ తనుగూడా చూస్తూ చూస్తూ రొచ్చులోకి దిగలేడు.

ఆ రోజు సుందర్రామయ్యగారు తీరుబడిగా వసారాలో కూర్చుని ఇదే విషయం గూర్చి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

'కాబట్టి బయట సంబంధాల కోసం పరుగులెత్తటం అన్నది అర్థం లేని పని కష్టాలని కొనితెచ్చుకున్నట్లే! అయినా తనకేం తక్కువ? ఇద్దరు రత్నాల్లాంటి మేనల్లుండగా! ఇద్దరూ మెరికల్లాంటి కుర్రాళ్ళు, బుద్ధిమంతులు, మంచి వుద్యోగాల్లో వున్నారు-అన్నిటికన్నా తనంటే వాళ్ళకి ఎంతో భక్తి, గౌరవం-తనమాట కాదనరన్న ధైర్యం తనకుంది. కాని వచ్చిన చిక్కల్లా ఇద్దరు చెల్లెళ్ళతోనే! తనకి చెల్లెళ్ళంటే ఎంత ప్రేమో, వాళ్ళకి అంత రెట్టింపు గౌరవం తనంటే ! లలితని వాళ్ళిద్దరూ, ఎవరికివారు తమ కోడల్ని చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో వున్నట్లు చూచాయగా తెలిసింది. మరి అటువంటప్పుడు కూతుర్ని ఏ మేనల్లుడికనివ్వటం? అంటే రెండో వారితో కోరి విరోధం తెచ్చు

కున్నట్లే గదా! ఇవన్నీకుదరవన్న వుద్దేశ్యంతోనూ కోరి చెల్లెళ్ళతో విరోధం తెచ్చుకోవటం ఇష్టంలేక కొన్ని బయట సంబంధాలు చూసిన మాట వాస్తవమే కాని వాటితో పూర్తిగా సంతృప్తి చెందలేకపోయారు. అదీకాక సమకాలిక అల్లుళ్లని చూస్తుంటే వొళ్లు జలదరించి, ఆప్రయత్నాన్నికి స్వస్తి చెప్పి; తిరిగి మేనల్లుళ్ల వద్దకే రావల్సి వచ్చింది. కాని ఎవరికి? అన్న ప్రశ్న మాత్రం అలాగే వుండిపోతుంది.

సుందర్రామయ్య గారు, వసారాలో అసహనంగా కదిలి, తిరిగి సర్దుకు కూర్చుని, సిగరెట్ తీసి వెలిగించి మళ్లీ ఆలోచనలో పడ్డారు.

'ఈ సమస్యని పరిష్కరిస్తుందేమో నన్న ఆశతో భార్యని అడిగి చూసారు బయట సంబంధాలకన్న, అయిన వాళ్లకి ఇవ్వటమే వుత్తమం అన్న విషయం ఏకాభిప్రాయం కుదిరిందిగాని, అసలు విషయం-అదే ఎవరికి అన్నదిమాత్రం, మీ ఇష్టం' అని భార్య తెలివిగా తప్పకోవటంతో- అక్కడే ఆగిపోయింది. చివరికి కూతుర్ని గూడా అడిగారు. ఆమె మొదట సమాధానం చెప్పలేదు. మళ్లీ ఆయన తరిచి తరిచి అడగ్గా, మీ ఇష్టం నాన్నా, నా మంచిచెడ్డలు మీ కన్నా నాకెక్కువ తెల్సా అని అన్నప్పుడు ఆయన కళ్లు ఆనందంతో చెమర్చాయిగాని; అసలు విషయానికి పరిష్కారం దొరకలేదు

సుందర్రామయ్యగారు ఆలోచించి, ఆలోచించి, చివరికి ఒకనిర్ణయాని కొచ్చారు. మహత్తరమైన పథకం వేసారు. అదే స్వయంవరం.

ఉగాది పండుగనాడు చెల్లెళ్లని, మేనల్లుళ్లని భోజనానికి పిల్చారు. ఆ రోజు భోజనాలయ్యాక, ఆడవాళ్లు వంట ఇంట్లో అంట కంచాల ముందు కూర్చుని కబుర్లలో పడితే, సుందర్రామయ్య గారు మేనల్లుళ్లిద్దర్ని ఎదురుగా కూర్చొ బెట్టుకుని అసలు విషయం కదిపారు.

"......అబ్బాయిలూ, అదీ విషయం. నాకు తెల్సు మీ రిద్దరికి లలితంటే ఇష్టం అని, అలాగే, నాక్కూడా మీరిద్దరూ సమానమే. నాకున్నది ఒక్కతే

కూతురు. కాబట్టి లలితని మీ రిద్దరిలో ఎవ్వరికివ్వాలన్న విషయంపై తర్జన భర్జన జరిపి, చివరికి ఒక నిర్ణయాని కొచ్చాను.''

ఇద్దరు మేనల్లుళ్లు, రామం, మూర్తి మామయ్య వైపు ఆదుర్దాగా చూసారు.

సుందర్రామయ్యగారు ముచ్చటగా ఇద్దరి వైపు చూసి, ''కాబట్టి లలితని ఎవరు చేసుకుంటారో మీరే తేల్చుకోవాలి'' అన్నాడు.

వారిద్దరూ తెల్లబోయి ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు.

''కంగారు పడకండి. నాకు తెల్సు మీక్కూడా అదంత సామాన్యమైన విషయం గాదని, అందుకు మీరిద్దరికి ఒకచిన్న పరీక్ష పెడాతా. అందులో నెగ్గిన వాళ్లు లలితని వివాహం చేసుకోవటానికి అర్హులు'' అని

కాని వాళ్లిద్దరికి ఆయన పెట్టబోయే పరీక్ష ఎటువంటిదో అర్థం కాలేదు. శివధనుర్భంగం చెయ్యాలా- మత్స్యయంత్రం కొట్టాలా? లేక పంచదార కార్డు తెచ్చి పెట్టాలా? అసలు విషయం ఎంత ఆలోచించినా బొత్తిగా అర్థం కాలేదు.

సుందర్రామయ్యగారు అయిదు నిమిషాలు వ్యవధిచ్చి, ''పరీక్ష అంటే కంగారు పడకండి, ఏం లేదు- నేను ఒక కథ చెబుతా. పూర్తిగావిని, నేనడిగిన ప్రశ్నకి, నాకు సంతృప్తి కలిగేలా సమాధానం ఎవరు చెబుతారో వారు విజేత ...... కాని ఒక విషయం మాత్రం గుర్తుంచుకోండి- ఎవరు గెల్చినా, రెండవ వారు 'స్పోర్టివ్' గా తీసుకోవాలి-నా కిద్దరూ సమానమే అని ముందే చెప్పాను. ఆలోచించు కోండి'' అని సిగరెట్ వెలిగించి ఇద్దరి వంక చూసారు, ఆశగా.

''సరే! చెప్పండి!'' అన్నా రిద్దరూ ఎంతో వుత్సాహంగా.

సుందర్రామయ్యగారు ''స్వయంవరం'' కథ మొదలెట్టారు.

x x x

వివాహం కాక పూర్వం మాధవరావు రాబోయే భార్యగూర్చి ఎప్పుడూ ఆలోచించ లేదు. తనక్కాబోయే భార్య ఇలా వుండాలి, అలా వుండాలని

ఆంక్షలు పెట్టుకోలేదు, గిరి గీసుకోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే అతడికి వివాహ వ్యవస్థ మీద, దాంపత్య జీవితం మీద అప్పటినాకా స్థూలమైన అభి ప్రాయాల్లేవు. అదే సునంద పాలిట పెద్ద శాపం అయింది.

మాధవరావు చదువు పూర్తి చేసాడు. ఒక వుద్యోగం కూడా సంపాదించాడు. తల్లి తండ్రి సంబంధం చూసి, 'మాకు నచ్చిందిరా నీ మాటేమిటి! అన్నప్పుడు, పిల్లని గూడా చూడకుండా, కనీసం ఆమె గూర్చి తెలుసుకోకుండా 'ఓ.కె' అనేసాడు.

సునంద, మాధవరావుల వివాహం జరిగి పోయింది. పెళ్లిలో మిత్రులు, "నీకేరా అదృష్టవంతుడిని, వుద్యోగం చేసే భార్యని సంపాదించావ్" అని అన్నప్పుడు మాధవరావు 'థాంక్స్' అనకపోగా మొహం మాడ్చుకున్నాడు. అది చూసిన మిత్రులు మళ్లీ కిక్కురు మనలేదు!

ఇక్కడ సునంద గూర్చి రెండు మాటలు చెప్పటం ఎంతైనా అవుసరం ఆమె నూరు పైసల ఈకాలపు పిల్ల. కంచు కాగడా వేసి వెతికినా ఆమెలో పాత చింతకాయ పచ్చడి తాలుకు చాదస్తాలు కనబడవు. ఆమెకి ఎన్నో ఆదర్శాలున్నాయి, నమ్మకాలున్నాయి, అంతకుమించి ఆశలున్నాయి. ఆమె గూడా వుద్యోగస్థురాలు కావటంతో ఆర్థిక స్వాతంత్రంతో బాటు, ఆమె భావాల్ని నిర్భయంగా చెప్పగలిగే ధైర్యాన్ని గూడా సంపాదించింది.

వాళ్ల దాంపత్య జీవితం ఒక ఏడాది మామూలుగానే సాగిందని చెప్పాలి.

మాధవరావు మొదటి నించి, అంటే చిన్నతనం నించి మహా మొండి మనిషి. తన మాటే నెగ్గాలంటాడు. బొత్తిగా పట్టువిడుపులు లేని మనిషి. అది సునందకి సుతరాము గిట్టదు.

చిన్నచిన్న విషయాల్లో గూడా పెద్ద ఎత్తున రభసచేస్తూ వుంటాడు. సునందకి అతడిలో నచ్చని విషయాల్లో ఇది గూడా ఒకటి.

"సునందా, సునందా!" గావుకేక పెట్టాడు ఒకరోజు

ఇంట్లో పని చేసుకుంటున్న సునంద, మళ్ళీ ఏదో కొంప మునిగిందని "ఏమిటండి" విసుగ్గా అంటూ వచ్చింది.

"ఈ చొక్కాకి గుండీలు కుట్టమని చెప్పానా? మరి కుట్టలేదే?" గర్జించి అడిగాడు.

"రాత్రేగా చెప్పారు. అట్లా పడేసి ఇంకో చొక్కా తొడుక్కెళ్లండి. సాయంత్రం కుడతా" అంటూ పోబోయింది.

"ఓహో! ఆ సంగతి నాకు తెల్సులే! అయినా నువ్వు వుద్యోగస్థురాలివి కదూ- మొగుడి చొక్కాకి గుండీలు కుట్టటం నామోషీ అని చెప్పరాదూ! వెళ్లు వెళ్లు నే కుట్టుకుంటాలే" అన్న మాధవరావు ఈసడింపుతో ఆగి,

"మాటి మాటికి నా వుద్యోగం సంగతి ఎత్తుతా రెందుకు? అంత వుబలాటంగా వుంటే కుట్టుకోండి" అని లోనికెళ్ళి పోయింది.

మాధవరావు కడుపు భగ్గుమంది!

మాధవరావుది విచిత్రమైన తత్వం. అతడిని అడిగి తప్పుచేసినా వొప్పుకుంటాడేమోగాని, అడక్కుండా బ్రహ్మాండమైన పని సాధించినా తిట్టి పోస్తాడు!

అది సునందకి నచ్చదు. ప్రతి విషయానికి అనుమతి తీసుకోటానికి నాకు వ్యక్తిత్వం లేకనా? అతడి ఇష్టానికి అనుగుణంగా ఎందుకు మారాలి?

ఒకరోజు రాత్రి భోజనాలయ్యాక మాధవరావు పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు.

ఇంటిపని ముగించుకొని వచ్చిన సునంద భర్తకి ఎదురుగా కూర్చుని ఏమండి' అంటూ పిలిచింది నెమ్మదిగ "చెప్పు అన్నట్లు"ఊ అంటూ పేపర్లోంచే మూలిగాడు- మాధవరావు!

"మా ఆఫీసులో హౌసింగ్ సొసైటి ఒకటుంది వాళ్ళుస్థలాలు అమ్ముతున్నారు. ఒక్క మెంబరుకి ఖాళీ వుందంటే చేరేసాను" అంది మెల్లిగా.

“నాకు చెప్పకుండా ఎందుకు చేరావ్?' ఠక్కున వచ్చింది ప్రశ్న

“ఇవాళే ఆఖరిరోజుట అదీకాక కాంపిటీషన్‌గా వుంది అందుకని సరే అనేసాను కరుగ్గా సమాధానమిచ్చింది.

“మొగుడంటూ ఒకడున్నాడు- వాడితో గూడా సంప్రదించాలి- అతడి అనుమతి తీసుకోవాలి అన్న జ్ఞానం లేకుండా పోయిందన్నమాట? అప్పట్లే ఎలావుంటుంది. నీకో వ్యక్తిత్వం ఏడ్చిందిగ అందులో ఉద్యోగస్తురాలివి” పేపరును కసిగా నేలకేసి కొడుతూ అన్నాడు.

“ఏవిటండి మీ రాద్ధాంతం ఇప్పుడు ఏమైందని? స్థలం కొనాలని అనుకోవటం తప్పా? మీతో సంప్రదించే సమయం లేక సరే అన్నాను అందులో నాకేం తప్పు కన్పించటం లేదు.” తీర్పు ఇస్తున్నట్లుగ చాలా ఈజీగ అన్నది

“సంపాదిస్తున్నానన్న అహంతో కళ్ళుమూసుకుపోయిన నీకు ఏదీతప్పుగా కన్పించదు. అయినా ఇప్పుడు స్థలాని కొచ్చిన తొందరేంలేదు గాని రేపు చేరనని చెప్పెయ్యి” ఎలాగైనా ఆమె మీద తన అధిక్యత చూపెట్టాలని అతడి తాపత్రయం.

“క్షమించండి. మాటిచ్చి కాదనలేను వాళ్లముందు తప్పు చేసినదానిలా నిలబడలేను, సారీ” అంటూ చటుక్కున లేచి లోపలికెళ్ళింది.

మాధవరావుకి శరీరంలోని మాంసం వుడికిపోయింది, ఎంత పొగరు? తన మాటంటే బొత్తిగా లక్ష్యం లేకుండా పోయింది చూస్తా దీని సంగతేమిటో! అని బుసలు కొట్టాడు.

వారు ఆ విషయంలో రాజీ పడలేదు. వ్యక్తిత్వాలు తలెత్తాయి, వారిద్దరి మధ్యా భార్యా. భర్తల నడుమ ఉండాల్సినవన్నీ రద్దయినాయి. సునంద భర్తని శాంత పరుద్దామన్న ప్రయత్నం కూడా చెయ్యలేదు. అది మాధవ

రావుకి మరింత కోపం తెప్పించింది. ఆమె వుద్దేశ్యం తను తప్పు చెయ్య నంతవరకు ఎవరికీ తలవంచి బతకక్కర్లేదు- చివకిరి భర్తకుగూడా!

అలా కొన్నాళ్ళు గడిచాయి - భారంగా బాధగా-ఇద్దరకీనూ.

ఒకరోజు మాధవరావు ఇంటి కొచ్చేసరికి, సునంద ఇంకా ఆఫీసు నుంచి రాలేదు. మామూలుగా అతడొచ్చేసరికి, అప్పటికే ఆమె వచ్చేసి వంటపనిలో వుంటుంది. కాని ఆ రోజు ఇంకా ఆమె రాలేదు.

విసుగ్గా తన వద్ద నున్న తాళం చెవితో తలుపు తీసి, బట్టలు మార్చుకుని పేపరు ముందేసుకుని సునంద కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

ఆరున్నరకి అలా కూర్చున్న వాడు తొమ్మిదింటి వరకూ అలాగే కూర్చుండి పోయాడు.

కాని సునంద మాత్రం రాలేదు.

మాధవరావులో క్షణ క్షణానికి కోపం, అసహనం, ఉద్రతం కాసాగాయి అప్పటికి వారిద్దరిమధ్య సన్నిహిత సంబంధాలు లేక పోవటంతో, ఆమెని సాధించటానికి, గెల్వటానికి ఇదొక సాకుగా మార్చుకుని, ప్రళయకాల రుద్రుడిలా ఆమెకోసం, ఎదురు చూస్తూ కూర్చున్నాడు,

కాని అమె ఇంకారాలేదు. ఇంతలో ఒక అపరిచిత వ్యక్తి, బిక్కు బిక్కుమంటూ వచ్చి "సునందగారిల్లు - ఇదేనాండి?" అని అడిగాడు

"ఇది మాధవరావు ఇల్లు-అంటే నా యిల్లు తమరెవరు?" కోపం ఎవరి మీద చూపాలో అర్థంకాక సతమతమౌతున్న మాధవరావు ఆ వ్యక్తి మీద విరుచుకు పడ్డాడు.

"మీరు-అమె భర్తేనాండి" అర్థంకాక అడిగాడు

"ఆమెకి భర్త కాదు-బంట్రోతుని-ఇంతకీ తమకేం కావాలి?"

"స్నేహితురాలి భర్తకి స్కూటరు యాక్సిడెంటయింది సునందగారు ఫ్రెండ్‌తో పాటు హాస్పిటల్లో వున్నారు - మీకు చెప్పమన్నారు" అసలు విషయం మెల్లిగా బయటపెట్టాడు.

"ఇంతకీ తమరెవరు?" వ్యంగ్యంతో కూడిన ప్రశ్న.

"నేను సునందగారి ఆఫీసులో పన్చేస్తాను మాఇల్లుఇక్కడికిదగ్గర్లోనే"

"తమరిక శలపు తీసుకోవచ్చు" పళ్లు పటపటలాడిస్తూ అన్నాడు.

అపరిచిత వ్యక్తి మాధవరావుని వింతగా చూస్తూ నిష్క్రమించాడు'

మాధవరావు మళ్లీ వచ్చి కుర్చీలో కూర్చునాడు.

అతడికి కడుపు కాలుతోంది.- గుండె మండుతోంది.

భార్య ఎదురుగా వుంటే పీక నులిమేసి చంపేద్దా మన్నంత కోపంగా వుంది.

'ఇక లాభంలేదు రానురాను దానికి నిర్లక్ష్యం ఎక్కువౌతోంది. తనంటే బొత్తిగా లెక్కలేకుండా పోయింది. తను వద్దన్నపని గుర్తుపెట్టుకుని మరీ చేస్తోంది' బుద్ధి చెప్పకపోతే మరీ బరితెగించే ప్రమాదం వుంది. అవును దానికి తగిన విధంగా బుద్ధి చెప్పాలి. తల తిరిగి నోట్లోకిరావాలి! ఆది మళ్ళీఆదర్శాలు వ్యక్తిత్వాలు అవీ వల్లించకూడదు - అలాచెప్పాలి గుణపాఠం.

కాని ఏం చెయ్యటం ?

ఏం చెయ్యాలో ఆ రాత్రి అంతా జాగరణ చేసి నిర్ణయించి, సునంద కోసం ఎదురుచూస్తు కూర్చున్నాడు.

మర్నాడు వుదయం ఆరింటికి రిక్షాలోంచి మెల్లగా దిగింది సునంద.

మాధవరావు గడపకి అడ్డంగా నిలబడ్డాడు

నిద్రలేని అతని కళ్లు ఎర్రగా నెత్తురు ముద్దల్లా వున్నాయి.

సునంద మెల్లగా ఇంట్లోకి పోబోయింది.

"ఆగు. ఎక్కడికి?" డైరక్షన్‌తోపాటు క్వశ్చన్ గూడా కలిపి అనేశాడు మగ మహారాజు మాధవరావు.

"ఇంట్లోకి" తడుముకోకుండా సమాధాన మిచ్చింది.

"ఇక్కడ నీకు స్థానం లేదు-తెల్లవార్లు ఎక్కడ పడుకున్నావో అక్కడికే పో" కసిగా అన్నాడు.

"తెల్లవార్లు ఎక్కడా పడుకోలేదు-ఆస్పత్రిలో ఆపదలో వున్న స్నేహితురాలికి సాయంగా కూర్చున్నా, లోపలికి పదండి మాట్లాడుకుందాం అతడివంక అసహ్యంగా చూస్తూ అంది.

"ఇక నీతో నాకు మాట్లాడాల్సిన పని లేదు. ఇంట్లోకి రావల్సిన అవుసరం నీకు లేదు- ఫో అవతలికి" బిచ్చగాడిని అన్నంత తేలిగ్గా అనేసాడు.

సునంద - గృహిణి, ఈ సంఘంలో సమాజంలోని ఒక వ్యక్తి - స్త్రీ మూర్తికి అహం దెబ్బతింది, వ్యక్తిత్వం తలెత్తింది.

"ఎందుకని" రెట్టించి అడిగింది.

'నీకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవుసరం లేదు. వెళ్లు వెళ్లు' అలాగె నిలబడ్డాడు, అలాగే అన్నాడు.

సునంద ఒక నిర్ణయాని కొచ్చింది.

"మీరు ఫోఫో అంటే పట్టుకు వ్రేలాడేందుకు నేనేం పురాణ కాలం స్త్రీని కాదు. మీ కోరిక ప్రకారం వెళ్లిపోతాను. కాని వెళ్లేముందు రెండు మాటలు చెప్పి మరీ వెడతాను.

నే నెన్నడూ తప్పు చెయ్యలేదు- ఇక చెయ్యను గూడా దానికి నా ఆత్మ ఆ పరమాత్మలే సాక్ష్యం. కాని ఈనాడు మీరు ఏదో తప్పు చేసినట్లుగా నన్ను నిందించి కాదు అనుమానించి వెళ్లగొడుతున్నారు. ఒక్కటి మాత్రం గుర్తించండి రోజులుమారాయి. ఆడది అందులో భార్యగూడా ఒక మనిషేనని గుర్తించాల్సిన తరుణం వచ్చింది. కొట్టినా, తిట్టినా పడుండే రోజులు పోయాయి. సాటి మనిషిని మనిషిగా గౌరవించటం నేర్చుకోండి- వృద్ధిలో కొస్తారు- కాస్త తప్పుకోండి నా వస్తువులు తీసికెడతా" అని అనంగానే మాధవరావు చటుక్కున ప్రక్కకి తొలిగాడు.

ఆమె చకచకా ఆమె తాలూకు సామాన్లు సర్దుకుని వెంటనే, ఒక పెట్టె పట్టుకునివచ్చి, రాయిలాగా నిలబడిచూస్తున్న భర్తతో(సారీ, మాధవరావుతో)

"నేను బ్రతకలేనని భయంలేదు. మీ తప్పు మీరు తెల్సుకుని, రమ్మని పిల్చే దాకా నే రాను. వస్తాను, గుడ్‌బై" అంటూ పెట్టె పట్టుకుని చకచకా నడచుకుంటూ వెళ్లిపోయిందా స్త్రీ శక్తి!

చూస్తు నిలబడటం తప్ప అతడేమీ చెయ్యలేకపోయాడు.

మళ్లీ మాధవరావు ఆమెని రమ్మని ఆహ్వానించలేదు.

సునంద రాలేదు.

అప్పటినించి ఇద్దరు సమాంతర రేఖల్లాగానే బ్రతక సాగారు.

చెప్పటం పూర్తి చేసిన సుందరరామయ్య గారు, ఇద్దరు మేనల్లుళ్ల వంక చూసి, వ్రతకల్పం లాగా చాలా నిష్ఠగా విన్నారని గ్రహించి, మెల్లిగా "అబ్బాయిలూ అదీకథ, పూర్తిగా విన్నారుకదా. ఇప్పుడు చెప్పండి. ఆ దంపతులిద్దరిలో ఎవరిది తప్పని మీ అభిప్రాయం? భార్య జీవితాన్ని ప్రతి క్షణం దుర్భరం చేసి, ప్రతి చిన్న విషయాన్ని కొండంతలు చేసుకుని, చివరికి తాడుని తెగే వరకు లాగిన మాధవరావుదా?

భర్తని కాదని, తనకీ వ్యక్తిత్వం వుంది ఋజువు చేసి, భార్యంటే బానిస కాదన్న

కొత్తసత్యాన్ని చాటిచెప్పాలని, అందుకు తన కాపురాన్నే పాడుచేసుకున్న సునందదా? రామం, ముందు నువు చెప్పు. నీ అభిప్రాయం" అన్నారు మొదటి మేనల్లుడి నుద్దేశించి.

రామం కుర్చీలో సర్దుకు కూర్చుని, కాలిమీద కాలేసుకుని. మెల్లిగ "ఖచ్చితంగా సునందదే. అందులో ఎటువంటి సందేహం లేదు. సంఘంలో ఆమెని అందరూ మాధవరావు భార్యగా గుర్తిస్తారుగాని, సునందగా మాత్రం కాదు. ఆమె చేసే ప్రతిపని అతడి పరువు, ప్రతిష్టలకి సంబంధం గల్గి వుంటాయి. కాబట్టి ప్రతిపని చేసే ముందు నా అనుమతి తీసుకోవాలన్న మాధవరావు వాదనలో ఎంతైనా అర్థం వుంది. బంగారు పళ్లానికైనా గోడవార లేక

పోతే నిలబడదు. ఆడది గూడా అంతే! ఎన్ని లక్షలు సంపాదించినా, భర్త చెప్పుచేతల్లో వుండాల్సిందే! అలాకాక భర్తను ఎదిరించి, ఆతడి మాటకి గౌరవం ఇవ్వక, ఆతడేదో అన్నాడని బంధాలు తెంచేసుకున్న సునందదే మొత్తం తప్పు ఆవిషయంలో ఆమె క్షమించరానిది'' పూర్తి చేసాడు ఆవేశంగా.

సుందర్రామయ్యగారు అతడు చెప్పింది విన్నారు. ఆయన కళ్లలో ఏ భావం కనబడనీయకుండా జాగ్రత్త పడ్డారు. మూర్తి వైపు తిరిగి, నీ అభిప్రాయం ఏమిటి?" అన్నారు.

మూర్తి గొంతు సరిచేసుకుని గట్టిగా,

నా వుదేశ్యంలో తప్పు ఇద్దరిదీను. తాడు తెగేదాకా లాగటం వుభయుల తప్పు. రెండుచేతులు కలిస్తేనేచప్పట్లు- అన్నట్లువాళ్లిద్దరిలోను లోపాలుండటం వల్లనే ఆ విధంగా బయటపడ్డారు. సంసార బండికి భార్యాభర్తలు చక్రాలాంటి వారు. ఒకరి భావాల్ని ఇంకోరు గౌరవిస్తు ఒకరి లోపాల్ని ఇంకోరు సరిదిద్దుతూ, చేయిచేయి కలిపి అన్యోన్యంగా ముందుకిపోకలిగిననాడే అదినూరేళ్ళ పంట అనిపిస్తుంది. అదేగాని భార్యాభర్తల్లో వొకరు హెచ్చు, ఇంకోరు తగ్గు అన్న భావం ఏ కోశాన వుండరాదు. సునంద లాగా తెంచుకుపోకూడదు- మాధవరావు లాగా మరీ కర్కోటకంగాను వుండకూడదు. అలా వుండలేక పోయారు కాబట్టి ఆ తప్పు, బాధ్యత ఇద్దరిదీను.'' అన్నాడు.

సుందర్రామయ్యగారు తృప్తిగా గాలి పీల్చారు.

శ్రావణ మాసంలో లలితని మూర్తికిచ్చి ఘనంగా వివాహం జరిపించారు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 1978)

# అలివేలుద్దీన్ అద్భుత దీపం...

"మా వారికి నేనంటే ఎంతో ప్రేమ, ఇష్టమున్నూ - మొన్నకి మొన్న అర్ధరాత్రి చీరె కావాలని మాటవరస కడిగానంతే! అప్పటికప్పుడు బజారెళ్ళి షాపు తీయించి పట్టు కొచ్చారు" చెప్పుకుపోతోంది అలివేలు.

"అలాగా - మా తల్లివికదూ ఇవ్వాళ రాత్రికి కాస్త మన రేషన్‌కార్డుల సంగతి అడిగిపెట్టు నీకు పుణ్యముంటుంది" అంది ప్రక్కింటి పిన్నిగారు.